## క్లుప్తంగా

### చెక్కుల పంపిణీ



**మహబూబాబాద్:** ఆరోగ్యశ్రీలో వర్తించని వ్యాధుల కోసమే సీఎం రిలీఫ్ ఫండ్ అని ఎంపీ మాలోత్ కవిత అన్నారు. స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం రూ.5లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను 11మంది లబ్ధిదారులకు ఎంపీ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌నాయక్ పాల్గొన్నారు.

### డీసీసీ ప్రధాన కార్యదర్శిగా నాగమణి



**గార్ల:** జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా సీతంపేట ఎంపీటీసీ గుండెబోయిన నాగమణిని నియమిస్తూ ఆదివారం డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి ఆమెకు నియామకపు పత్రాన్ని అందజేశారు.

### వెండి పాదాల బహూకరణ



**కురవి:** మండల కేంద్రంలోని వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళీ అమ్మవారికి ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన భక్తులు తల్లాడ వెంకటేశ్వర్లు ధనలక్ష్మీ, తల్లాడ విజయ్‌కుమార్ మౌనిక, శివాన్స్‌లు ఆదివారం 940 గ్రాముల వెండి పాదాలను బహూకరించారు.

### హాస్టల్ తనిఖీ

**కేసముద్రం:** మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఏఎస్‌డబ్ల్యూఓ సుధాకర్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించాడు. ఈ మేరకు హాస్టల్ పరిసరాలను పరిశీలించాడు. హాస్టల్‌లో కల్పిస్తున్న సౌకర్యాల తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలను ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### శౌర్య జాగరణ యాత్ర



**గూడూరు:** మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి దేవాలయం నుంచి ఆదివారం శౌర్య జాగరణ యాత్రను విశ్వహిందూ పరిషత్ భజరంగదళ్ సహ సమ్యోజక్ వెంకటేష్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్, నరేష్‌గౌడ్, శ్రీను, రాసమల్ల వెంకటేశ్వర్లు, మడిపెద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

### జైనుల ర్యాలీ



**డోర్నకల్:** దస్‌లక్షణ్ పర్వ్ వేడుకల ముగింపును పురస్కరించుకుని డోర్నకల్‌లో ఆదివారం జైనులు ర్యాలీ నిర్వహించారు. ఆదినాథ్ భగవాన్ విగ్రహాన్ని ఊరేగించారు.

### డోర్నకల్‌లో ముస్లింలు..



**డోర్నకల్:** మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని ముస్లింలు ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

### డీసీఎంను ఢీకొట్టిన ఆటో

**గూడూరు:** ఆగిఉన్న డీసీఎంను ఆటో ఢీకొట్టిన సంఘటన మండలంలోని మర్రిమిట్ట శివారు నేషనల్ హైవేపై ఆదివారం చేసుకుంది. వివరాలు.. కేసముద్రం మండలం కోరుకొండపల్లి శివారు మేఘ్యా తండాకు చెందిన పది మంది గుంజేడు జాతరకు వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో మండలంలోని మర్రిమిట్ట శివారు నేషనల్ హైవేపై ఆగిఉన్న డీసీఎంను ఆటో ఢీకొట్టిందన్నారు. ఈ ఘటనలో ఒకరికి చేయి విరిగి తీవ్రగాయాలు కాగా మరో నలుగురుకి స్వల్ప గాయాలు అయ్యాయన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయాలైన వారికి పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో గాయాలు

**కురవి:** రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన సీరోలు మండలం చింతపల్లి గ్రామ శివారు పెద్దలాలు తండాలో జరిగినట్లు ఆదివారం సీరోలు ఎస్సై రమాదేవి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి శివారు పెద్దలాల్ తండాకు చెందిన భూక్య ఈర్య అనే వ్యక్తి తన ఆవులను మేపుకుంటూ వస్తున్నాడు. మరిపెడ వైపు అతి వేగంతో కారు ఈర్యను ఢీకొట్టింది. ఈర్య తలకు బలమైన గాయం కావడంతో మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా శ్రమదానం నిర్వహించారు. మున్సిపాలిటీల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ఆలయాల్లో పెరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, వైద్యులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్: 19వార్డులో జిమ్‌లో శుభ్రం చేస్తున్న చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి




నెహ్రూసెంటర్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



డోర్నకల్: శ్రమదానం చేస్తున్న ప్రజాప్రతినిధులు



మహబూబాబాద్ రూరల్: శ్రమదానం చేస్తున్న కౌన్సిలర్, స్థానికులు



మరిపెడ: శ్రమదానం చేస్తున్న కౌన్సిలర్లు, స్థానికులు



నెల్లికుదురు: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కేసముద్రం: శ్రమదానం చేస్తున్న ప్రజాప్రతినిధులు



గూడూరు: స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ



కురవి: వీరన్న సన్నిధిలో..



మరిపెడ రూరల్: బీచ్‌రాజ్‌పల్లిలో..



గార్ల: రోడ్డు శుభ్రం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



బయ్యారం: ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కొత్తగూడ: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

## గిరిజన యూనివర్సిటీ మంజూరుపై హర్షం

**మహబూబాబాద్ అర్బన్:** ప్రధానమంత్రి మోదీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు ప్రాంతంలో గిరిజన యూనివర్సిటీకి రూ.900కోట్లు మంజూరుపై బీజేపీ మాజీ అధ్యక్షుడు యాప సీతయ్య, బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోతు మదన్ లాల్ ఆదివారం ఆనందం వ్యక్తం చేశారు.

## చైతన్యం కలిగించేవే కళలు

**తొర్రూరు రూరల్:** ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై అన్నివర్గాల ప్రజల్లో చైతన్యం కలిగించేవి కళలే అని ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి సదానందం అన్నారు. ఆదివారం మండలంలోని కంఠాయపాలెం గ్రామంలో ప్రజానాట్య మండలి మండల మహాసభలో సదానందం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేక మంది కళాకారులు తమ ప్రతిభను అనేక ఉద్యమాలు, పోరాటాల్లో చూపించారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు బోర స్వామి, నక్క సైదులు, హరీపాబేగం, శ్రీను, హరిత, యాకుబ్, సాంబయ్య, రామ్మూర్తి, కుమార్, కళాకారులు పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యంతో ఎదగాలి

**గూడూరు:** ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు వృత్తి నైపుణ్యంతో ఎదగాలని, ఆర్థికంగా బలోపేతం కావాలని సీఐ ఫణిధర్ అన్నారు. ఈనెల 6,7,8 తేదీలలో హైదరాబాద్‌లో రాష్ట్ర ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఫొటో టెక్ ఎక్స్‌పో కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చెన్నబోయిన లక్ష్మణ్, బాలచందర్, శ్రీధర్, లాల్‌సింగ్, సాయి, సురేష్, ఏఎస్సై శ్యాంసుందర్ పాల్గొన్నారు.

## బీజేవైఎం మండల అధ్యక్షుడిగా సురేష్



**కురవి:** బీజేవైఎం మండల అధ్యక్షుడిగా తట్టుపల్లి గ్రామానికి చెందిన గుండగాని సురేష్‌ను జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రామచంద్రరావు నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు బుడిగె భద్రసేనాగౌడ్ ఆదివారం తెలిపారు.

# కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



నర్సింహులపేట: రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

**నర్సింహులపేట:** సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఆదివారం నర్సింహులపేట క్రాస్ రోడ్డు వద్ద వరంగల్–ఖమ్మం హైవేపై అంగన్‌వాడీ కార్యకర్తలు రాస్తారోకో చేశారు. జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తు చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సమ్మెట లలిత, టేకుల సరిత, చంద్రకళ, శ్రావణి, సరోజన, రోజా, విమల, సుహాసిని, పార్వతమ్మ, భారతి పాల్గొన్నారు.

**చిన్నగూడూరు:** కుటుంబ పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలనిడోర్నకల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెహ్రూనాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్, దాశరథి సోదరుల విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని నెహ్రూ నాయక్ సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోయిని యాకన్న, ప్రధాన కార్యదర్శి వేణు, యువ మోర్చా మండల అధ్యక్షుడు మధు పాల్గొన్నారు.

## విజయవంతం చేయాలి

**దంతాలపల్లి:** ఈనెల 5న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని గొల్లకురుమలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉడుగుల ఐలేష్, ఎర్రబోయిన మురళీ అన్నారు. ఆదివారం మండలంలోని గొర్రెల మేకల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. డీడీలు కట్టిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గంగయ్య, సురేష్, హరీశ్, లింగన్న, మల్లయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

## చర్య తీసుకోవాలి

**డోర్నకల్:** లఖింపూర్ ఖేరీ దినం సందర్భంగా అక్టోబర్ 3న రాష్ట్ర వ్యాప్తంగా బ్లాక్ డే నిరసన కార్యక్రమాలు పాటించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. లఖింపూర్ ఖేరీలో నలుగురు రైతులు, ఓ విలేకరి మరణానికి కారణమైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ఆశీష్‌కుమార్ మిశ్రాపై చర్య తీసుకోవాలన్నారు.

## పింఛన్ రూ.10వేలకు పెంచాలి

**కురవి:** దివ్యాంగులకు పింఛన్ రూ.10వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాజా అన్నారు. ఆదివారం సూదనపల్లి గ్రామంలో సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాకయ్య, బైరి వీరన్న, సత్తెమ్మ, ఎల్లయ్య, అశోక్, భద్రయ్య పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు మద్దతు



మహబూబాబాద్: సమ్మె వద్ద మాట్లాడుతున్న ఉపేందర్

**మహబూబాబాద్:** వేతనాలు అకౌంట్‌లో జమయ్యే వరకు సమ్మె ఆగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 4వ రోజుకు చేరింది. ఈసందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.2వేల వేతనం పెంచుతున్నట్లు ప్రకటించి నేటికి అమలు చేయలేదన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, నాగన్న, రుజన్య, రాధిక, యాకమ్మ, రాణి పాల్గొన్నారు.

**కార్మికుల సమస్యలు పరిష్కరించాలి**

**కురవి:** మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని బీఎస్పీ జిల్లా కన్వీనర్ గుగులోత్ పార్వతిరమేష్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సమస్యల పరిష్కారం కోసం మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విజయ్‌కాంత్, అభినాయక్, ప్రసాదరావు, ఉపేందర్, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి

**పెద్దవంగర:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని రెడ్డియూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మంత్రి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు , స్థానికులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మండపంలో కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభ, ఉప సర్పంచ్ వీరారెడ్డి, నాయకులు ఈదురు ఐలయ్య, ఎర్ర వెంకన్న, యూత్ నాయకులు చందర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, రెడ్డియూత్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

**కేసముద్రం:** వచ్చేఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అమీనాపురంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియామకమైన అంబటి మహేందర్‌రెడ్డిని ఆదివారం కేసముద్రంవిలేజ్, ఇనుగుర్తి మండలం చెట్లముప్పారం గ్రామ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు చిట్ల సంపత్, మండల యూత్ అధ్యక్షుడు జగన్, మహేందర్, శివాజీ పాల్గొన్నారు.

# 8 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం చూపిస్తున్న పోలీసులు

**గార్ల:** మండలంలోని గోపాలపురం గ్రామంలో ట్రాలీ ఆటోలో అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తూ ఆదివారం ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా పండితాపురం గ్రామానికి చెందిన లక్ష్మినారాయణ, సాయికుమార్‌లు గోపాలపురం గ్రామంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి తరలిస్తుండగా సమాచారం మేరకు పోలీసులు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం తోపాటు ట్రాలీ ఆటోను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు.

# అమరవీరుల ఆశయాలను కొనసాగించాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

**మహబూబాబాద్ రూరల్:** స్వాతంత్రం కోసం పోరాటంలో అమరత్వం పొందిన అమరవీరుల ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకోవాలని తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపర్తి యాదగిరి కోరారు. జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం ఆవరణలో గల జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట దేశవ్యాప్తంగా పిలుపులో భాగంగా ఆదివారం అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధులు రాపర్తి యాదగిరి, తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం లీగల్ అడ్వైజర్ బి.రవీంద్ర గుప్తా, సంఘం రాష్ట్ర ప్రతినిధి సింగు రమేష్, వారసులు చిలుకపల్లి ముత్తిలింగం, బొడ్ల మధుసూదన్ రావు పాల్గొన్నారు.

## అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

**మహబూబాబాద్:** మంత్రి హరీశ్‌రావు కమ్యూనిస్టులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రావణ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో బిందు, ఎల్లారీశ్వరి, మంగ, అండాలు, వీరలక్ష్మి, శివకుమారి, పద్మ పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**నేడు ఎమ్మెల్యే పర్యటన**

**డోర్నకల్:** డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పర్యటించనున్నారని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

**యువకుడి అదృశ్యం**

**మహబూబాబాద్ రూరల్:** మండలంలోని బలరాం తండా గ్రామానికి చెందిన సంతోష్ అదృశ్యమైన సంఘటనలో అతడి భార్య నవ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్సై రాంచరణ్ ఆదివారం తెలిపారు.

**ఎమ్మెల్యే పరామర్శ**

**మరిపెడ రూరల్:** మండలంలోని తండధర్మారం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గుగులోతు వెంకన్న(75) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

**సర్పంచ్ మృతి**

**అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రి**




**తొర్రూరు రూరల్:** అనారోగ్యంతో మండలంలోని జమస్తాపురం సర్పంచ్ జూరెడ్డి రవీందర్‌రెడ్డి ఆదివారం ఉదయం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తోపాటు మండల, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొని రవీందర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో మంత్రి పాల్గొని పాడె మోశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ కాకిరాల హరిప్రసాద్‌రావు, ఎంపీపీ అంజయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ఇసుక ట్రాక్టర్ సీజ్**

**దంతాలపల్లి:** మండలకేంద్రంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో పోలీసులు తనిఖీ చేస్తుండగా సూర్యాపేట్ జిల్లా, అర్వపల్లి మండలం, జజిరెడ్డిగుడెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుందన్నారు. గమనించిన పోలీసులు డ్రైవర్ బింగి సురేష్ వద్ద అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ సీజ్ చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

**మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీశైలం**



**నెల్లికుదురు:** యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొంపెల్లి శ్రీశైలం ఎంపికయ్యాడు. తన నియామకానికి సహకరించిన నాయకులకు శ్రీశైలం కృతజ్ఞతలు తెలిపాడు.

# ఆక్సిజన్ కాన్సంట్రేట్ అందజేత



**కేసముద్రం:** కేసముద్రంవిలేజ్‌కి చెందిన వేంశెట్టి కనకలక్ష్మీ కొద్ది రోజులుగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుంది. రూ.20లక్షల వరకు అప్పుతెచ్చి చికిత్స చేయించారు. ప్రస్తుతం ఆమె ఆక్సిజన్ మీదనే ఉండాల్సి రావడంతో క్లబ్ జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్‌రావును సంప్రదించారు. ఈమేరకు ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆక్సిజన్ కాన్సంట్రేట్‌ను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, సెక్రటరీ పరాంకుశం శ్రీహరి, కోశాధికారి శామకూరి నర్సయ్య, చంద్రశేఖర్, సత్యనారాయణ, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.